క్లుప్తంగా

మండల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

చాపాడు: మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారిగా ఆత్మా పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఆత్మా పీడీ విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ రామస్వామి రెడ్డి

రాజుపాళెం : చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని మండల విద్యాశాఖాధికారి రామస్వామి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందిన వారంతా నిరాశ చెందవద్దని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్ పోటీలను నిర్వహించినట్లు పీడీ సుబ్బయ్య తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో చేటు

పోరుమామిళ్ల: రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారని, దీనివల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని, భూమిలో భూసారం తగ్గి క్రమంగా పంట దిగుబడులు తగ్గుతాయని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ సుదర్శనాచారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మార్కాపురం, కమ్మవారిపల్లె గ్రామాల్లో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. మానవాళికి, జంతువులకు ముప్పు కలిగిస్తూ, పర్యావరణానికి కీడు చేసే రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలని ఆయన చెప్పారు. సేంద్రియ, జీవన ఎరువులు ఉపయోగిస్తే మొక్కలకు కావాల్సిన పోషకాలు అందిస్తాయని, మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. జీవన ఎరువుల వినియోగం రైతులకు లాభదాయకమని చెప్పారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి


అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి

కాశినాయన : మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ మైథిలి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల పాలనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులతో హెచ్‌ఎం చిత్రాప్రభావతి, అధ్యాపకులు

కలసపాడు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసిన సెయింట్ ఆంటోనీస్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. సత్తా చాటిన విద్యార్థులను సెయింట్ ఆంటోనీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్రాప్రభావతి అభినందించారు. పీఈటీలు సుమన్, సురేష్, కోమలమేరీ తదితరులు పాల్గొన్నారు.

గాలి మాట.. నీటి మూట

అంతన్నాడు.. ఇంతన్నాడే గంగరాజు.. అన్నట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ తీరు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా చంద్రబాబు, కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్‌లో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. సూపర్ సిక్స్ మోసం పక్కకు పెడితే.. ఎన్నికల ప్రచారంలో ప్రొద్దుటూరులో 350 పడకల ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు అపరెల్ పార్కు మంజూరు చేస్తామని, కుందూ–పెన్నా కాలువపై, రాజోలి ఆనకట్ట నిర్మాణంపై శ్రద్ధ పెడతామని, భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరత లేకుండా చూస్తామని ప్రకటించారు. అలాగే మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కూడా ఎన్నికల ప్రచారంలో హామీలిచ్చారు. ఇప్పటివరకు ఈ హామీల అమలుపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

- మాట ఇచ్చారు.. మడమ తిప్పారు
- హామీలు మరచిన కూటమి నేతలు
- వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం
- ప్రొద్దుటూరులో మెడికల్ కాలేజీ హుళక్కేనా?


ఎన్నికల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, పక్కన చంద్రబాబు (ఫైల్)

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో ఉన్న 350 పడకల ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణంగా ప్రస్తుతం అవలంభిస్తున్న ప్రభుత్వ విధానమే. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు సంబంధించి పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసి నిర్మించడం జరిగింది. కాగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పులివెందుల మెడికల్ కళాశాలకు సంబంధించి సీట్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ పరిస్థితిని బట్టి ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీ మంజూరయ్యేనా అని ప్రజలు చర్చించుకున్నారు. ఈ ఏడాది మార్చి 30న ఎన్నికల సందర్భంగా పుట్టపర్తి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీని మంజూరు చేస్తామన్నారు. చేనేత కార్మికులను దృష్టిలో పెట్టుకుని అపరెల్ పార్కు మంజూరు చేస్తామని ఆగిపోయిన కుందూ–పెన్నా కాలువపై, రాజోలి ఆనకట్ట నిర్మాణంపై శ్రద్ధ పెడతానన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రొద్దుటూరులో ఇసుక కొరత లేకుండా చూస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలోనే ప్రొద్దుటూరులో మురికి కాలువల ఆధునీకరణ పనులు మంజూరు కాగా, ఎన్నికల అనంతరం ఆగిపోయాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. వంద రోజుల కూటమి పాలనలో ప్రొద్దుటూరు అభివృద్ధికి సంబంధించి మార్పు పడలేదు.

హామీలు మరచిన 'పుట్టా'

చాపాడు: సార్వత్రిక ఎన్నికలకు ముందుకు మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నియోజవర్గ అభివృద్ధి కోసం అనేక హామీలు ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తి అయినప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా అడుగులు వేయడం లేదు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా స్మశానాలను అభివృద్ధి చేస్తానని, పెన్నానది తీరం, కొండ, వంకలు, వాగుల ప్రాంతాలలో రైతుల ఆధీనంలో ఉంటూ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పిస్తామని, రాజోలి ఆనకట్ట నిర్మాణం చేపడతామని సుధాకర్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో హామీలు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఈ హామీల అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మైదుకూరులో ఉన్న పశువుల సంతను గత ప్రభుత్వం అభివృద్ధి చర్యల్లో భాగంగా బద్వేలు రోడ్డులోని గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేయగా, టీడీపీ ప్రభుత్వం రాగానే అక్కడి నుంచి నంద్యాల రోడ్డులోని గతంలో ఉన్న చోటికే పశువుల సంతను మార్చారు. దీంతో మైదుకూరు నుంచి నాలుగైదు కి.మీ మేర సంత కార్యకలాపాలతో ఆ ప్రాంతాలలో జరిగే అభివృద్ధిని అడ్డుకున్నట్లు అయిందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

వందరోజుల పాలన అట్టర్‌ప్లాప్

ఏపీలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన అట్టర్‌ప్లాప్ అని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఎద్దేవాచేశారు. శుక్రవారం రెడ్యం మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా.. వంద రోజుల కూటమి పాలనపై తగుదనమ్మా.. అంటూ సంబరాలు చేసుకోవడం కూటమి నేతలు, శ్రేణులకే చెల్లిందని ఎద్దేవాచేశారు. అభివృద్ధి చేయకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలనతో రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

మైదుకూరు : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ మైదుకూరు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని గంగాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు చూస్తారని తెలిపారు. కేంద్రంలో వారికి ఇచ్చే గుడ్లు, పాలు ఇతర పౌష్టికాహారం వలన వారు ఎత్తు బరువు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు కూడా ఇంటిలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శి సుజాత మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

చాపాడు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని ఓబుళరెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారా మాసోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఫుడ్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సంధ్య, భారతి, వెంకటసుబ్బమ్మ, వరలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌చార్ట్ అమలు చేయాలి

పోరుమామిళ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులకు మేలు జరిగేలా జాబ్‌చార్ట్, ప్రమోషన్ చానల్ రూపొందించేలా చర్య తీసుకుంటుందని ఆశించామని, కానీ ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయమనడం అవమానించడమే అని గ్రామవార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిద్దేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్ల స్థానంలో కొన్ని ఇండ్లను మ్యాపింగ్ చేసి, కరపత్రాలు పంపిణీ చేయమనడం, స్టిక్కర్లను అంటించమనడం సచివాలయ ఉద్యోగులను హీనంగా చూడటమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు గౌరవప్రదమైన జాబ్‌చార్ట్ రూపొందించి అమలు చేయాలని సిద్దేశ్వరరెడ్డి కోరారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక టీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

బద్వేలు అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ నాగభూషణం పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ స్టేషన్ పరిధిలోని మడకలవారిపల్లె సమీపంలో బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందని, దీని వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడటంతో పాటు ఎంతో మంది అంగవైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఇకపై ప్రతిరోజు డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. అలాగే ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ కె.శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పగటి దోమ కాటు ప్రాణాంతకమే

మైదుకూరు : పగటి దోమ కాటు ప్రాణాంతకమేనని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దశెట్టిపల్లెలో ఇద్దరికి డెంగీ జ్వరాలు రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమై శుక్రవారం ఇంటింటి ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. నిల్వ ఉన్న నీటిలో అబేట్ చల్లారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటిలో నీటి నిల్వలను పరిశీలించారు. వైద్య శిబిరం వద్ద వైద్య సిబ్బందితో మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ పగటి పూట కుట్టే దోమల ద్వారా డెంగీ జ్వరం వస్తుందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒకటి రెండు రోజులు జ్వరం తగ్గకపోతే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష, వైద్యాధికారి డాక్టర్ సుధ, ఏఎంఓ వెంకట్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

పోటా పోటీగా ఎస్జీఎఫ్ ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో శుక్రవారం మండల స్థాయి ఎస్జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికలకు ఎంపికలు జరిగాయి. కబడ్డీ, ఖోఖో విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలను ఆర్‌సీపీఈ ప్రిన్సిపాల్ రవిశంకర్, ఎంఈఓ సావిత్రమ్మ, ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీల నిర్వాహకులు షేక్ బాబు, ఓబయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్‌సీపీఈ కళాశాల విద్యార్థులు పర్యవేక్షించారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

బి.కోడూరు : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మలేరియా అధికారి పి.మనోరమ అన్నారు. బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని మనోరమ ఆకస్మిక తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ కేసులు, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. కీటక జనిక వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ల్యాబోరేటరీని సందర్శించి యాక్టివ్, పాసివ్, రక్తనమూనాలను పరిశీలించి రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, హెచ్ఈఓ శివశంకర్‌రెడ్డి, సీహెచ్ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, యూడీసీ రామచంద్ర, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్సు వేదవతి, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో శుక్రవారం జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ఐ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. అండర్–14, 17 విభాగంలో బాల బాలికలకు పోటీలను జరిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 60 క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ప్రతిభ కనపరచిన క్రీడాకారులను అక్టోబర్‌లో నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జార్జ్ కారొనేషన్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. పోటీలను ఎస్జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ అరుణకుమారి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు నాగరాజు, ఉదయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శివారెడ్డి, శివశంకర్, పద్మజ, విలోనియ రాణి పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

దువ్వూరు : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల ప్రత్యేక అధికారి షేక్ ఇమ్రాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకుపల్లె గ్రామంలో జరిగిన ×ఇది మంచి ప్రభుత్వం× కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం వంద రోజుల పాలనలో పింఛన్ రూ.4వేలుకు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమం మండలంలో రోజుకు 4 పంచాయతీల్లో 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ ప్రగతిపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, ఉపాధి ఏపీఓ డాక్టర్ వసంతకుమార్, నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు, పీవీ సుబ్బయ్య నాయుడు, నాగభూషణం, చిరాకి మాబు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందజేస్తున్న మండల ప్రత్యేక అధికారి ఇమ్రాన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ప్రొద్దుటూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు


కలసపాడు : ఎగువ రామాపురం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది


కాశినాయన : వరికుంట్లలో సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి

కలసపాడు : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి సుజనలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువ రామాపురం సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం, పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత మెరుగుపడాలంటే విరివిగా మొక్కలు నాటి పెంచాలన్నారు. కరువులు, వరదలు, తీవ్ర ఎండలు లాంటి ప్రకృతి విపత్తుల నుంచి బయట పడాలంటే మొక్కలు పెంచినప్పుడే సాధ్యపడుతుందన్నారు. చెట్లు ఎక్కువగా ఉన్నప్పుడు స్వచ్ఛమైన గాలి లభించి అనేక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్.వి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది రహమతుల్లా, మల్లికార్జున, ప్రశాంతి, స్వర్ణలత, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కాశినాయన : పరిసరాలను పరిశుభ్రత ముఖ్యమని మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ మైథిలిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని వరికుంట్ల గ్రామంలో స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామమంతా తిరిగారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక సచివాలయంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గ్రామస్తులు చెత్తచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, పంచాయతీ కార్యదర్శి గురుకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

గోపవరం : ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రామకృష్ణయ్య సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బేతాయపల్లె గ్రామ సచివాలయం పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై హరితరాయబారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతరం ఆదర్శంగా ఉండాలి

ప్రొద్దుటూరు : యువత అందరికీ ఆదర్శంగా ఉండేలా సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ యువత సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.కిరణ్, ఎన్.హరినాథరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


గోపవరం : బేతాయపల్లెలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రామకృష్ణయ్య

